## క్లుప్తంగా

### దోమలగూడ నూతన ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



**చిక్కడపల్లి:** దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్ పోలీస్‌స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ కార్యక్రమంలో భాగంగా దోమల్‌గూడను ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌గా ఏర్పాటు చేశారు. 2004 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి గతంలో నర్సాపూర్, వనపర్తి, మిర్యాలగూడలలో పనిచేశారు. గత ఏడాది నుంచి పోలీస్ కమాండ్ కంట్రోలర్ సెంటర్, ఇతర కంట్రోల్‌సెంటర్‌లలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ, గాంధీనగర్ పోలీస్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ ఏసీపీ యాదగిరికి రిపోర్ట్ చేసి బాధ్యతలు స్వీకరించారు.

### చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఆకుల సతీష్



**చిక్కడపల్లి:** చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నానునాయక్ కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన సతీష్ మొదట మారేడ్‌పల్లి ఎస్సైగా అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాలో నగర టూటౌన్ ఎస్సైగా కామారెడ్డి, చౌటుప్పల్‌రూరల్, మీర్‌చౌక్, సైబర్‌క్రైమ్ విభాగాల్లో విధులు నిర్వహించిన అనంతరం ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై అఫ్జల్‌గంజ్ డీఐగా బదిలీఅయ్యారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు.

### ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ముషీరాబాద్:** ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో తొలివిడత అడ్మిషన్లు 2023–24కు ఉత్తర్వులు జారీ చేసినట్లు ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం. హనుమానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో మే 17 నుంచి జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సీ మెమో, కులధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్, బోనఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోలను స్కాన్‌చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ITITelangana.Gov.in వెబ్‌సైట్‌లో మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.


### సెంట్రల్ పీస్ కమిటీ వెస్ట్‌జోన్ అధ్యక్షురాలిగా తేజురావు



తేజురావును అభినందిస్తున్న పీస్ కమిటీ ప్రతినిధులు

**కాచిగూడ:** సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ వెస్ట్‌జోన్ అధ్యక్షురాలిగా తేజురావును నియమించినట్లు సెంట్రల్ పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి శ్రీకిషన్ శర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు నూతనంగా నియమితులైన కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు. సెంట్రల్‌జోన్ అధ్యక్షుడు శశికాంత్ అగర్వాల్, షేక్ నయీమ్, మహ్మద్ అసద్, గోపాల్‌దాస్, ఎస్.శరత్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు వస్త్రాల పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్:** బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్, ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జైసింహలు పాల్గొన్నారు.

### యాదయ్య గౌడ్‌కు సంతాపం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**అంబర్‌పేట:** అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తండ్రి యాదయ్యగౌడ్ మృతిపట్ల పలువురు సంతాపం ప్రకటించారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో జరిగిన సంతాప సభకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్లు హేమశ్యామల దేవేందర్‌రెడ్డి, ప్రభు, స్వామియాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. యాదయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



బతుకమ్మకుంటలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ



ఎంసీహెచ్ కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అధికారులు

# సీడీపీ నిధులతో అభివృద్ధి పనులు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న ఎమ్మెల్యేలు

**ముషీరాబాద్:** నియోజకవర్గంలో 'కాన్స్టిట్యూన్సీ డెవలప్‌మెంట్ ఫండ్' (సీడీపీ) నిధుల నుంచి తాగునీరు, డ్రైనేజీ అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని సాయిరెడ్డి పటేల్‌నగర్, మోహన్‌నగర్, ఎంసీహెచ్‌కాలనీ, పటాన్‌బస్తీ, ఫ్రెండ్స్‌కాలనీ, భరత్‌నగర్, కుమ్మరిసంఘం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్లలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కార కేంద్రాలుగా మారాలని సూచించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు సోమన్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ ప్రసాద్, ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్, శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు తదితరులున్నారు.

### రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట్ బతుకమ్మకుంటలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అంతర్గత, ప్రధాన రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి తక్షణ మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలి



నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

**కవాడిగూడ:** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే న్యాయవాద రక్షణచట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కవాడిగూడలోని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయం, ధర్మంకోసం పాటుపడే న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈ దాడులను అరికట్టేందుకు వెంటనే న్యాయవాద రక్షణచట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇటీవల యుగేందర్ అనే న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ.. రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద పలువురు న్యాయవాదులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టినట్టు ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, బార్ కౌన్సిల్ మెంబర్ దన్వాడ మధుసూదన్‌రావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## సలంద్రి రమేష్‌యాదవ్ మృతి బీజేపీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

**కవాడిగూడ:** సలంద్రి రమేష్‌యాదవ్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం దోమలగూడ గగన్‌మహల్‌లో రమేష్‌యాదవ్ కుటుంబసభ్యులను దత్తాత్రేయ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లి బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్ బాబు, సలంద్రి దిలీప్‌యాదవ్ తదితరులున్నారు.

## అకాల వర్షంతో విరిగిన చెట్లు!

- ఎమ్మెల్యే ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాల తొలగింపు
- సహాయక చర్యలు చేపట్టిన డీఆర్ఎఫ్ బృందం

**నల్లకుంట:** ఈదురు గాలులతో కురిసిన వర్షానికి నల్లకుంటలోని పలు ప్రాంతాలలో వృక్షాలు, చెట్ల కొమ్మలు నేల కొరిగాయి. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ డీఆర్ఎఫ్ (ఎమర్జెన్సీ స్క్వాడ్)ను అప్రమత్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ఆదేశాలతో డీఆర్ఎఫ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన ఆయా ప్రాంతాల్లో నేల కొరిగిన చెట్ల కొమ్మలు, రోడ్డుకు అడ్డుగా వ్యర్థాలను తొలగింప జేశారు. విద్యుత్‌శాఖ అధికారులు తెగిపడిన విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరింపజేశారు.



బాగ్‌అంబర్‌పేటలో తొలగింపజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

**అంబర్‌పేట:** అకాల వర్షాలకు ఆయా ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీవర్షంతో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో బతుకమ్మకుంట, డీడీ కాలనీ, గంగాబౌలి ప్రాంతా ల్లో చెట్లు నేలకొరిగాయి. సమాచారం అందుకున్న బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఆ యా ప్రాంతాల్లో పర్యటించారు. విరిగిన చెట్లను ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో తొలగింపజేశారు.


## పోలింగ్ బూత్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ వేణుగోపాల్

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో పోలింగ్‌బూత్ స్థాయిలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీఎంసీ వేణుగోపాల్ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం అంబర్‌పేట్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పోలింగ్‌బూత్‌ల వివరాలను వెల్లడించారు. ఓటర్ జాబితాలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ పార్టీ నుంచి అజయ్‌కుమార్, సీపీఎం నుంచి మహేందర్, బీఆర్ఎస్ నుంచి అక్తర్ పాషా, అధికారులు ప్రవీణ్ చంద్ర, హరిశంకర్, రజిత తదితరులున్నారు.

## ఈనెల 26న టీజేఎస్ ప్లీనరీ



మాట్లాడుతున్న నర్సయ్య తదితరులు

**ముషీరాబాద్:** తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశాలను ఈనెల 26న ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య వెల్లడించారు. సోమవారం రాంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జనసమితి రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాలు జూలై 4న సూర్యాపేటలో ఉన్నాయని దీనిలో భాగంగా ఆయా జిల్లాల ప్లీనరీ సమావేశాలను ముందస్తుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాంచందర్, ముషీరాబాద్ జనసమితి కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రగిరి సత్యనారాయణ, జనసమితి నగర నాయకులు సురేష్, లక్ష్మణ్, అశ్వక్, జైపాల్‌రెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు కాకునూరి సుధాకర్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రవీందర్‌యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు అజయ్‌గౌడ్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, రాంనగర్ కన్వీనర్ పులిపాటి సుధాకర్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మహేష్ తదితరులున్నారు.

## 'ఆర్ఆర్ఆర్' సెంటర్ ప్రారంభం



'రెడ్యూస్ రీయూజ్ రీ సైకిల్ 'సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** పనికిరాని వస్తువులు, బట్టలు, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎవరింట్లో ఉన్నా వాటిని ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీయూజ్ రీ సైకిల్) సెంటర్‌లో అందించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్ కుమార్ సూచించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రాంకీ సంస్థ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్‌షెహర్' అనే ఉపశీర్షికతో స్వచ్ఛభారత్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' సెంటర్‌ను సోమవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ సెంటర్ 10 రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. తమ ఇంటి ఆవరణ, చెత్తకుప్పల్లో పారవేయకుండా పనికిరాని వస్తువులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బట్టలు ఈ సెంటర్‌లో అందించాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వినయ్‌కుమార్, ఆనంద్‌రావు, ప్రశాంత్, జవాన్‌లు లింగం, విజయ్, ఎస్ఎఫ్ఏ రాజు, సోమేష్, శ్రీనివాస్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

### అనిల్‌కుమార్‌యాదవ్‌కు సన్మానం

**కాచిగూడ:** కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ఎం.రాజ్‌కిరణ్ సోమవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. సికింద్రాబాద్ జిల్లాలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని పార్టీ కార్యకర్తలకు అండగా ఉండే నేత అధ్యక్షుడిగా రావడం తమకు ఆనందంగా ఉందన్నారు.

### చేనేత కార్మికుడికి రూ. లక్ష అందజేయాలి

**కాచిగూడ:** ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులవృత్తులకీ చేయూత, కుటుంబానికి రూ. లక్ష పథకాన్ని అత్యంత ఇబ్బంది పరిస్థితులలో ఉన్న పద్మశాలీయుల చేనేత అనుబంధ పనుల శ్రామికులకు వర్తింపజేసి అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. దుర్భరస్థితిలో ఉన్న కులవృత్తుల వారికి ఇది ఎంతో మంచి పథకం అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 వేల మగ్గాల ద్వారా సుమారు రూ.3 లక్షల మంది పద్మశాలీ శ్రామికులు జీవనాధారం పొందుతున్నారన్నారు.

### వ్యక్తి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**చిక్కడపల్లి:** బాగ్‌లింగంపల్లిలో ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న షాద్‌నగర్ మండలం మేడిపల్లి ప్రాంతానికి చెందిన కుమ్మరి లక్ష్మయ్య(48) హత్య కేసులో నిందితుడిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. యాచకవృత్తి నిర్వహిస్తున్న తన భార్య చన్నుతో లక్ష్మయ్య అక్రమ సంబంధం కొనసాగిస్తుండటంతో ఒడిషాకు చెందిన ఉజ్జల్‌గిరి బండరాయితో లక్ష్మయ్య తలపై మోది హత్య చేసి పరారయ్యాడు. కాగా సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో చిక్కడపల్లి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారని ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపారు.

### ఓటర్ల జాబితాలో సవరణలు

**ముషీరాబాద్:** కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై చర్చించేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పలు రాజకీయ పార్టీలు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఓటరు జాబితాలో నకిలీ ఓట్లు, చనిపోయిన వారు, చిరునామా మారిన వారి పేర్ల పరిశీలన, తొలగింపు, పోలింగ్‌స్టేషన్ల మార్పులు చేర్పులపై చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించారు. దీనిపై బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ప్రతి పోలింగ్‌బూత్‌కు ఒక అధికారిని నియమించి అవసరమైన శిక్షణనిచ్చి ఓటరు జాబితాను పక్కాగా రూపొందించడం జరుగుతుందన్నారు. ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప, ఏఎంసీ జాకీర్ హుస్సేన్, ఏసీపీ మంజులసింగ్, శ్యామ్ సుందర్, మాధవ్, మహ్మద్‌అలీ, ఎండీ దస్తగిరి (బీఆర్ఎస్), రమేష్‌రామ్ (బీజేపీ), అజీజ్ ఉస్మాని (ఎంఐఎం), అనిల్‌కుమార్, వాజీద్‌హుస్సేన్ (కాంగ్రెస్), వెంకటస్వామి, వసీంఖాన్ (సీపీఐ) పాల్గొన్నారు.

## వేసవి భక్తి సంగీత శిక్షణ శిబిరం



వేసవి భక్తి సంగీత శిక్షణ పునఃశ్చరణ తరగతులకు హాజరైన ఔత్సాహికులు

**నల్లకుంట:** శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతులకు విశేష స్పందన వస్తోందని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. ఏప్రిల్ 24న ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు ఈ నెల 27తో ముగుస్తాయని నిర్వాహకులు ప్రకటించారు., ఈ నెల 28న బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరం ధ్యాన మందిరంలో ముగింపు వేడుకలు ఉంటాయని వివరించారు. సోమవారం ముగింపు వేడుకల భక్తి సంగీత పునఃశ్చరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని కీ బోర్డు, భక్తి గీతాలను ఆలపించారు. అకాడమీ డైరెక్టర్ వసుధామూర్తి మాట్లాడుతూ.. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా బాగ్ అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీరెడ్డి, దుర్గా ప్రసాద్‌రెడ్డి దంపతులు, దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రిక సంపాదకుడు మరుమాముల వెంకటరమణ శర్మ, ప్రముఖ విద్యావేత్త పుష్పాభట్ హాజరవుతారన్నారు.

**నృత్య శిక్షణాతరగతులు..**

**కాచిగూడ:** భరత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, దాక్షిణాత్యా ఆర్ట్స్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో 'కూచిపూడి ప్రాచీన సంప్రదాయ అడవుసాము పద్ధతి' అనే అంశంపై కాచిగూడలోని నృపతుంగా స్కూల్‌లో సోమవారం విద్యార్థినులకు శిక్షణ తరగతులను నృత్యగురువు డాక్టర్ అనితరావు ప్రారంభించారు. ఈనెల 24 వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని ఆమె వివరించారు. ఏ నృత్యానికైనా మొదటి అడుగులు పునాది వంటివని, అవి సమంగా నేర్చుకుంటేనే నృత్యాంశాలను చక్కని పదవిన్యాసంతో ప్రదర్శించగలరన్నారు. ప్రాచీన కూచిపూడి నృత్య సంప్రదాయ పరిరక్షణే ధ్యేయంగా యువ, విద్యార్థి నృత్య శిక్షకుల కోసం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. నృత్య గురువులు నెమలికంటి సువర్ణలత, రామలింగశాస్త్రి, డాక్టర్ తడకమళ్ల అనురాధ తదితరులున్నారు.

### ఎన్టీఆర్ జీవితచరిత్ర ఓ పాఠ్య పుస్తకం

**చిక్కడపల్లి:** ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఓ పాఠ్యపుస్తకమని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. 'శకపురుషుడి శతజయంతి' పేరిట సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో తారక రామా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణను నిర్వాహక సంస్థ ప్రతినిధి, ఎన్టీఆర్ వీరాభిమాని శరత్‌చంద్ర తదితరులు సన్మానించారు. ప్రముఖ సినీ నిర్మాత కొమ్మినేని వెంకటేశ్వరరావు, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, సాయిబాబా, మాజీ కార్పొరేటర్ బాల్‌రాజ్‌గౌడ్, శివకుమార్, కట్టారాములు ఉన్నారు.

## 'డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టించడంలో ప్రభుత్వం విఫలం'



ధర్నాలో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టించి ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు అరుణ్ కుమార్ ఆరోపించారు. ప్రభుత్వం తూతు మంత్రంగా కొన్ని చోట్లనే నిర్మించి చేతులు దులుపుకుందని ఇంకా అనేక చోట్ల పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో బీజేపీ రాంనగర్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కరెంటు, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుడిసెవాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ మల్లేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జైపాల్‌రెడ్డి, పూసరాజు, మద్దూరి శివాజీ, బెజవాడ రవీందర్, రఘునాథ్, ఉడుతల బాలకృష్ణ, శీలం ప్రవీణ్‌కుమార్, రాజు, కేశవ్, శ్రీకాంత్, జ్యోతి, కళావతి, పద్మ, లక్ష్మీ, విశాల్ సింగ్, బాలస్వామి తదితరులున్నారు.

### వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ



నియామక పత్రాలను అందజేస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

**కాచిగూడ:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. సోమవారం నారాయణగూడలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఎన్నికల్లో పోటీ చేయడానికి దళిత బహుజనులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సందేశ్ యాత్రలో భాగంగా రాజ్యాధికారం చైతన్య ర్యాలీని జూన్ 24న పెద్దపల్లిలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు రాంచందర్ ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ కరుణాకర్, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాసరి రవికుమార్ తదితరులున్నారు.

### జీవో 59 ప్రకారం అర్హులందరికీ రిజిస్ట్రేషన్ చేయాలని వినతి

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ క్వార్టర్స్‌ల ఖాళీ స్థలాలను జీవో 59 ప్రకారం అర్హులందరికీ కేటాయించాలని కోరతూ ఆయా కాలనీవాసులు హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ ఎస్‌పీఆర్. మల్లేష్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దాదాపు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న సుమారు 200 మంది కుటుంబాలు జీవో నెంబర్ 59 ప్రకారం తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. దీనిపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, కార్పొరేటర్, ఆర్డీఓలకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్టు సమాచారం. కాలనీవాసులు రవి నాయుడు, మారిశెట్టి నర్సింగ్‌రావు, నర్మట మల్లేష్, మోబిన్ రమేష్, జైన్ దేవయ్య, ఆకాష్, దేవీలాల్, సాయిలు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీవాసులు

## చట్ట సభల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలి



బహుజన ప్రజాశక్తి కన్వీనర్ నల్ల లక్ష్మణ్ తదితరులు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు వారి వారి జనాభా దమాషా ప్రకారం చట్టసభల్లో అవకాశం కల్పించాలని బహుజన ప్రజాశక్తి వ్యవస్థాపక కన్వీనర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బహుజన వర్గాలను సంఘటితం చేసి రాజ్యాధికారం వైపు నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దక్కన్ దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించటంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని విమర్శించారు. మహనీయుల లక్ష్యాలను బహుజన ప్రజాశక్తి ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాధికారం వైపు కృషి చేస్తుందన్నారు. బహుజన ప్రజాశక్తి రాష్ట్ర నాయకులు ముసునూరి యాదగిరి, నోముల గణేష్, రమేష్, హైదరాబాద్ ఇన్‌చార్జ్ ఇంద్రాల శేఖర్‌కుమార్, పెదాల మల్లేష్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్యశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నల్లకుంట పోలీస్ స్టేషన్ ఎస్సైలు కిషన్, అశోక్‌కుమార్‌లు

**ముషీరాబాద్:** అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్వెస్ట్ అలయన్స్ సహకారంతో నడుస్తున్న కంప్యూటర్ శిక్షణను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని నల్లకుంట పోలీస్‌స్టేషన్ ఎస్సైలు కిషన్, అశోక్ కుమార్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ శిక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అప్సా, క్వెస్ట్ అలయన్స్ లాంటి సంస్థలు పేద విద్యార్థుల కోసం కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కూడా అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఉచిత శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముషీరాబాద్‌లో పేద విద్యార్థినీవిద్యార్థులకు 18 నుంచి 25 ఏళ్లలోపు యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని అనుభవం గల అధ్యాపకులచే శిక్షణ అందిస్తున్నట్లు ప్రకటించారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కంప్యూటర్ శిక్షణ తీసుకునే వారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ పాస్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో విద్యానగర్‌లోని శిక్షణ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. శిక్షణ ఉపాధ్యాయురాలు రమణి, అప్సా సీనియర్ కో– ఆర్డినేటర్ రమేష్, శ్రావణి, లావణ్య, మూర్తి తదితరులున్నారు. మరిన్ని వివరాలకు 8464007488 నంబరును సంప్రదించాలని కోరారు.